# పత్రికా ప్రకటన

పాత నేరస్తులలో పరివర్తన తెచ్చేలా రాచకొండ పోలీసు వారి "మార్పు కోసం ముందడుగు"

ఈరోజు సిసిఎస్ భువనగిరి పోలీస్ వారు వైఎస్సార్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో "మార్పు కోసం ముందడుగు" పేరుతో నేరచరిత్రగల వారిలో మార్పు కోసం సదస్సును నిర్వహించారు. రాచకొండ డీసీపి క్రైమ్స్ మధుకర్ స్వామి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు సుమారు 400 ల మంది నేరచరిత్ర గలవారు తమ కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యారు.

ఈ సదస్సులో రాచకొండ కమిషనర్ శ్రీ డి.ఎస్ చౌహాన్ ఐపీఎస్, గారు ప్రసంగిస్తూ గతంలో నేరాలకు పాల్పడిన వారు నేరములు వీడి ప్రస్తుత సమాజంతో నవజీవనాన్ని గడుపుతూ హుందాగా జీవించాల్సిన అవసరాన్ని చెప్పారు. పాత నేరస్తులతో మార్పు తీసుకురావడానికి సిసిఎస్ పోలీస్ వారు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయం అని, ఈ కార్యక్రమం ద్వారా పాత నేరస్తులు పరివర్తన చెంది నూతన జీవితం మొదలు పెట్టడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సత్పరివర్తనతో జీవించే వారికి పొలిసు వారి సహాయ సహకారం ఉంటుందని, వారు కొత్త జీవితము మొదలు  పెట్టడానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఇటువంటి గొప్ప ప్రయత్నం మొదలు పెట్టిన క్రైమ్ డీసీపీ మధుకర్ స్వామి గారిని కమిషనర్ గారు ప్రత్యేకంగా అభినందించారు.

నేరస్తులు తొందరపాటులో నేరాలు చేసినా సరే తప్పు చేయని వారి కుటుంబం కూడా దాని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుందని తెలిపారు. గతాన్ని మరచిపోయి  మారిన మనసుతో ముందడుగు వేయాలని, అందులో వారి కుటుంబ పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు. జైలులో గడిపే వారికంటే నేరాలకు పాల్పడకుండా సమాజంలో మంచి పౌరులుగా ఉండే వారికి కుటుంబంతో సంతోషంగా గడిపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదస్సుకు హాజరైన పాత నేరస్తులు పోలీస్ శాఖ వారు తమలో మార్పు కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం పై తమ సంతోషాన్ని వ్యక్తం చేసినారు.

డీసీపీ మధుకర్ స్వామి  గారు మాట్లాడుతూ నేరాలు మానేసి సత్ప్రవర్తనతో జీవించే వారి పిల్లలకు ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో సీట్లు ఇప్పించే ప్రయత్నం చేయడం ద్వారా ఉచిత విద్య అందిస్తామన్నారు. పదేళ్ల వరకు ఎటువంటి నేరాలకూ పాల్పడని వారి మీద క్రైమ్ షీట్లు తొలగిస్తామని పేర్కొన్నారు.  గతంలో వారి పైన నమోదయిన  కేసుల  విషయంలో అడ్వకేట్లకు భారీగా ఫీజులు చెల్లించుకునే అవసరం  లేకుండా అవసరమైన సలహాలు సూచనలు ఇస్తామని,

ఉచిత న్యాయ సహాయం కూడా  అందిస్తామని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్ ల్యాండ్స్ వారి సహకారంతో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి మళ్ళీ వృత్తి జీవితం మొదలు పెట్టడానికి అవసరమైన సహకారం కూడా అందిస్తామని పేర్కొన్నారు. నేరస్తులు పాత నేర జీవితం మర్చిపోయి సత్ప్రవర్తన అలవరచుకుని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా గౌరవ ప్రదమైన జీవితం సాగించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ యాదాద్రి రాజేష్ చంద్ర ఐపీఎస్, అదనపు డీసీపీ క్రైమ్స్ లక్ష్మి గారు, ఏసిపి వెంకట రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్ ల్యాండ్స్ చైర్మన్ డాక్టర్ విద్యా భూషణ్,  ప్రొ. లక్ష్మి కుమారి, ప్రొ, రాజ్ కుమార్, రఘునాథ రెడ్డి గార్లు,  భువనగిరి  ఇన్స్పెక్టర్ సైదయ్య మరియు ఇన్స్పెక్టర్ దేవేందర్ లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.




PRESS

